చేతిలో ముందు రోజు కొన్న క్రీమ్ బిస్కెట్ల పేకెట్ ఉంది ఉదయం కోసిన ఎర్ర గులాబీల ఆకు పొట్లముంది ఎలా మాట్లాడాలో రిహార్సిల్ వేసు-కొన్న ధైర్యం కొంత ఉంది

రోడ్డు మీద నడుస్తున్నాడు అతని మనస్సులో అప్పుడు రక రకాల ఆలోచనలు తలెత్తాయి ఓ చదువుకొంటున్న అమ్మాయి రూముకు వెళ్ళడం సముచితమేనా? అసభ్యత అనిపించుకొంటుందా? తర్వాత వచ్చే పరిణామాలు ఎలా ఉంటాయి? అతని మనస్సు హెచ్చరిస్తున్నది సవ్యమైన భావాలతో ఒక యువతి దగ్గరకు వెళుతున్నాను గాని తుచ్ఛమైన ఉద్దేశంతో కాదే అతని మనస్సులోని మనస్సే సమా-ధానపర్చింది ఒక విధమైన ధైర్యంతో చంద్రలీల రూము దగ్గరకు వచ్చాడు మెట్లు ఎక్కాడు వరండాలో నుంచున్నాడు లోపలినుండి మాటలు వినబడుతున్నవి శంకరం తన ఉనికిని తెలియజేయడంకోసం మెల్లగా దగ్గాడు అది విని లోపలినుండి కుక్క 'భౌ భౌ, మన్న చబ్దం విన్పిం-చింది అతనికి చిన్నగా వణుకు ప్రారంభమైంది అంతలో ఎవరో కాలేజీ అమ్మాయి తొంగి చూసింది అతని సంగతి ఊదేసింది కాబోలు కొద్ది నిముషాల తర్వాత అతిశయంగా, కొంచెం చిరాగ్గా చంద్రలీల గొలుసుతో కుక్కను పట్టుకొని బైటకు వచ్చింది

సంభ్రమం సంకోచం స్వాతిశయం కలగా-పులంగా ఉన్న చంద్రలీల వదనం మోహనంగా ఉంది కాని కుక్క మాత్రం శంకరాన్ని చూసి, పైకి రాబోతున్నది కింగ్! తప్పు అని బుజ్జగించింది చంద్రలీల

ఇంతకుముందు తొంగి చూసిన పిల్ల రెండు ఫోల్డింగ్ కుర్చీలు వరండాలో వేసింది కుక్కను లోపలికి తీసుకొని వెళ్ళింది శంకరం గాలి పీల్చు కొన్నాడు గుండెలో దడ తగ్గింది ఇంకా నుంచునే ఉన్నాడు

చంద్రలీల అతనివైపు కుర్చీని నెట్టింది మాట్లా-డితే మాణిక్యాలు రాలిపోతాయి కాబోలు అను-కొన్నాడు శంకరం బుద్ధిగా కూర్చున్నాడు తలంతా బ్లాంక్ అయిపోయింది నోరు ఎండి పోయింది పెదాలు తడుపుకొంటున్నాడు


'సుశీ! ఓ గ్లాసు మంచి నీళ్ళు తేవే' కేకేసింది

వెంటనే ఇందాకటి అమ్మాయి గాజుగ్లాసులో నీళ్ళు తెచ్చి యిచ్చింది త్రాగి. గ్లాసు యిస్తూ 'థాంక్స్ అన్నాడు నవ్వుతూ వెళ్ళింది లోపలకు

'ఊఁ ' అంటూ కుర్చీకి ఆనుకుని నిలబడింది చంద్రలీల వచ్చిన పని చెప్పి వెళ్ళండి అన్నట్లుగా ఉంది ఆమె ఆంతర్యం శంకరం చంద్రలీల వైపు చూశాడు ఆమె ఎటో చూస్తున్నది ఎట్లా మొదలు పెట్టాలో అతనికి అర్థం కాలేదు గొంతు సవరించు-కొన్నాడు

'నే నే నేను ఫైనల్ బి ఏ చదువుతున్నా నా పేరు భవాని శంకరం నేను మీతో అంటుండగానే చంద్రలీల మాట్లాడింది

'ఆడ పిల్లల కాలేజి గేటు దగ్గర బీటు వేసే మీరు ఫైనల్ బి ఏ చదువుతున్నారా?



బాగుంది   ఎగతాళి గొంతులో ధ్వనించింది

నేను దురుద్దేశంతో గేటు దగ్గర నిలబడలేదే?

'కావచ్చు, పోలిక చెప్పవలసివస్తే తాటి చెట్టు, గేటు – రెండూ ఒక్కటే!'

'కానీ తాటి చెట్టు దగ్గర కల్లు కోసం, కాలేజి గేటు దగ్గర కళ్ళ కోసం

'ఏ కళ్ళ కోసం?

మీ కళ్ళ కోసం   ఊహించని సంభాషణ సాగుతున్నదనిపించింది శంకరానికి

ఆఁ   మిస్టర్ భవాని శంకరంగారు మీరు హద్దు మీరి మాట్లాడుతున్నారు మీరు ఇక్కడకు రావడం ఒక తప్పు, ఔచిత్యం లేకుండా మాట్లాడటం రెండో తప్పు ఒక మాట మాట్లాడేముందు, ముందు వెనుకలు చూసి, అవతలి వాళ్ళ ఆంతర్యం చూసి మాట్లాడాలి

చంద్రలీలగారు! ఇక్కడకు రావడం తప్పు కాదనను కాని తప్పుగా ప్రవర్తించలేదు, ప్రవర్తించను ఈ సంభాషణ ఇట్లా మారుతుందని అనుకోలేదు నేను ఎందుకు సాహసించి, ఇక్కడకు రావలసి వచ్చిందో తెలుసుకోవాలని లేదా?'

అది నాకు అనవసరం   ఇట్లా రావడం ఎటువంటి పరిణామాలకు దారి తీస్తుందో మీరు ఊహించారా?

బాగా ఊహించాను పరిణామాలు, పలితాలు సవ్యంగా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకొంటున్నా'

'సరే   ఏ పలితం ఆశించి వచ్చారో చెప్పండి '

'నేను   నేను   మిమ్మల్ని   ఆరాధిస్తున్నా మీరు హర్టు కావచ్చు   ముందు వినండి   కాదంటే వెళ్ళిపోతా

ఈ మాట చెప్పడానికి ఇక్కడి కొచ్చారా?

అవును   అక్కడ ఈ మాట చెప్పడానికి వీలుండదని, మీ ఉద్దేశం తెలుసుకోడానికి వీలు కల్గదనీ

'అసలు మీరు మాట్లాడుతున్న దానిలో అర్థం ఉందా? ఒక పెళ్ళికాని పిల్ల దగ్గరకు వచ్చి ఆరాదిస్తున్నానని చెప్పడానికి ఇట్లా రావడం మంచిదేనా? ఆడపిల్లకి కూడా మగ మహారాజుల్లా మనసుంటుందనీ   తల్లీ దండ్రులుంటారనీ, హోదాలు, అంతస్థులు ఉంటాయనీ, వాళ్ళకీ ఆరాధనా తత్వం ఉంటుందని మీకు తెలియదా?'

'మీరన్నది కరక్టే   కాదన్ను   నా ఉద్దేశం తెలియజెప్పడానికే నేను వచ్చింది   మీరూ ఆలోచించండి   లోకంలో ఇలాంటివి ఎక్కడ జరగవంటారా? అందరి దగ్గరికీ వెళ్ళి ఒక మగవాడు ఆరాధించానని ప్రాధేయపడడు నచ్చిన వాళ్ళ దగ్గరే మనస్సు విప్పుకుంటాడు   పోతె మీ మాటల్ని బట్టి, హోదాలు, అంతస్థులు మీ కిష్టమని గ్రహించాను రెండు మాటలుచెప్పి రెండు నిముషాల్లో వెళ్ళిపోతా

## ఆశావాదము

నువు కోరుకున్న  
రైలుబండి ఓ జీవిత కాలము  
లేటని తెలిసి కలత చెందకు  
కనీసం నీ కోసం  
కాచుకొన్న ఎద్దుల బండిలో నయినా  
కదులు మొండిగా!  
'కుందేలు – తాబేలు' కథ  
జ్ఞాపకం వుంది గదా నీకు  
గమ్యం కలిసొస్తుంది  
దానంతట కదే నీ చెంతకు!

-"శ్రీకాంత్"

# చంద్రలీల ప్రేమలీల

ఇక్కడకు రెండుమైళ్ళ దూరంలో ఉన్న గ్రామం నా స్వంగామం   నా తల్లి దండ్రులకు ఒక్కణ్ణే! ఆరు ఎకరాలు మాగాణి ఉంది   ఇక్కడకు మైలు దూరంలో నే రెండు ఎకరాల నిమ్మతోట ఉంది   సొంత ఇల్లుంది   ఇది నా కున్న ఆస్థి, వ్యక్తిగా ప్రేమించే మనస్సున్నది ఆరాధించే తత్వం ఉంది   ఒక వ్యక్తిని సుఖ పెట్ట గలిగేందుకు నాకున్న ఈ అర్హతలు చాలనుకొంటాను'

చంద్రలీల మాట్లాడలేదు   లోపలికి వెళ్ళింది   ఒక నిముషం అయిన తర్వాత గొలుసుతో కుక్కను తీసుకొని వచ్చింది   రెండో చేతిలో నాలు గైదు సవరన్ల చంద్రహారం ఉన్నది   భవాని శంకరం చూచేటట్టు దాని మెడలో ఆ బంగారు చంద్రహారం వేసింది

'చూడండి! శంకరంగారు! కుక్క మెడలో చంద్రహారం వేయడమంటే నావంటిది పది ఎకరాలున్న వ్యక్తిని పెళ్ళి చేసుకోవడమన్నమాట! మీరు చూశారుగా స్కూటరులో నా కోసం పడిగాపులు పడుతున్న శ్రీధర్‌ను, నాకు దూరపు బంధువైన మామయ్య కొడుకు పది లక్షల ఆస్థికి వారసుడు అతనంటేనే నేను పెదవి విరుస్తున్నాను తెలిసిందిగదూ! మనస్సులు, ఆరాధనలు, ప్రేమలు నా దృష్టిలో అర్థం లేవని అనలేను గాని డబ్బుతో ముడి పడేలేవు! దానిలో సందేహంలేదు నాకున్నది ఆకాశాన్ని అందుకొనే ఆశ! కాబట్టి మీరు వెళ్ళవచ్చు మీకు నిరాశ కల్గించినందుకు ఏమి అనుకోకండి నమస్కారం

'లీలా! ఎందుకే అంత పెడసరంగా మాట్లాడతావు నెమ్మదిగానే చెపొచ్చుగా   అని సుశీల అంటున్నా, సుశీ! నీకు తెలియదు   నోరు మూసుకో ఆ ఫోటో గ్రాఫర్ ఐదు గంటలకు వస్తానన్నాడు గదా డాక్టరు గారింటికి   అప్పటికి మనం కూడా రెడిగా ఉంధాం మన కింగ్‌ను కూడా చంద్రహారంతో ఫోటో తియ్యించాలి   నువ్వు మర్చిపోకు   అన్నది

భవాని శంకరం ముఖం కందగడ్డలా అయ్యింది అతని కన్నులు మండిన పువ్వు లయ్యాయి   అతని గుండె కొలిమి అయ్యింది   అతను లేచి చంద్రలీల వైపు చూసి చక చక వెళ్ళిపోయాడు   పెదవులపై నవ్వుకొన్నది చంద్రలీల మెడలో చంద్రహారంతో కింగ్ శంకరం కిటికిలో ఉంచిన బిస్కట్ల పేకెట్ పూల పొట్లాల మీదకు ఎగబడింది   చంద్రలీల దాని ముందు నాల్గు బిస్కట్లు ఉంచి, గులాబీల పొట్లం విప్పి, సాలోచనగా కొన్ని క్షణాలు ఉన్నది

నీకు ఎవడు దొరుకుతాడో గాని   ఈ శంకరంగారి వంటి వాడైతే గాని నీ చేదు తిన్నగా తీయదు ఏమిటమ్మా నీ చూకుడు – ఆయనకేం తక్కువన్నీ, మంచి చెడు లేకుండా వాగడమేనా?   ' అని సుశీల అంటూ చంద్రలీల చేతిలోని పొట్లంలో నుండి ఒక గులాబి పువ్వు తీసుకొన్నది

'నాకు తెలుసుగాని నువ్వు మాట్లాడక చూడు ఏం జరుగుతుందో   ? అని ఆ ఫోటో గ్రాఫర్ వచ్చుంటాడు   ఆ వేప చెట్టు క్రింద కింగ్‌ను ఫోటో తీయిద్దాం అబ్బా! ఆ ప్రక్క యింట్లో కుక్కలున్నాయి గదరా! సరే   నువ్వెళ్ళి అతను వస్తున్నాడో లేదో చూడు అన్నది

సుశీల వెళ్ళి రెండు నిముషాల్లో తిరిగి వచ్చి 'అక్కణ్ణుంచి బయల్దేరాడు   మనం రెడీ కావాలి' అన్నది.

'ఈ కుర్చీమీద కింగ్‌ను ఎక్కించి తీయిద్దాం ఫోటో   ఊఁ   పద   వేప చెట్టు దగ్గరకు' అని ఇద్దరు కలసి, కింగ్‌ను కుర్చీని తీసుకొని వెళ్ళారు కింగ్‌ను కుర్చీమీద కూర్చోబెట్టి, మెడలో వేసిన చంద్రహారం సరి చేశారు

సైడ్ పోజు అయితే చంద్రహారం చక్కగా కనబడుతుంది కదటే లీలా' అన్నది సుశీల

'నిజమేఁ   . ఫోటో గ్రాఫర్ ఏమంటాడో చూద్దాం'

ఈ ఇద్దరు మాట్లాడుతుండగా ప్రక్క యింటి దొడ్లో నుంచి ఒక కుక్క హఠాత్తుగా కింగ్ మీద దూకింది   అది కింగ్ కంటే పెద్దది. కింగ్ కూడా తన యజమానురాలి అండ చూసుకొని దానిపైనబడి కొరకబోయింది   అంతలో చంద్రహారం కింగ్ మెడలో నుంచి జారి, ఆ కుక్క మెడలో పడిపోడం క్షణాల్లో జరిగి పోయింది

ప్రక్కన దొరికిన కర్ర పుల్లలతో, రాళ్ళతో ఆ కుక్కను కొట్టడానికి చంద్రలీల, సుశీల ప్రయత్నించేటప్పటికి అది భయంతో పరుగు లంకించుకొన్నది

సుశీల జరిగింది గ్రహించి, 'అమ్మో! లీలా! ఆ కుక్క మెడలో చంద్రహారం పడిపోయిందే కింగ్ మెడలో నుంచి.... ఇప్పు డెట్లా?' కంగారుగా అని, 'బాబోయి.... కుక్క చంద్రహారం తీసుకెళ్తున్నది.... పట్టుకోండి.... పట్టుకోండి.... పట్టుకోండి....' అని అరచేటప్పటికి, రోడ్డు మీద జనం పోగయి, కుక్క వెంట పడ్డారు. కుక్క ఇంకా కంగారు పడింది. ఉరుకుల పరుగులతో భయంతో పరుగెత్తింది. జనం బిలబిలమంటూ కర్రలు పట్టుకొని దాన్ని వెంబడించారు. అది రోడ్డు మీదనుంచి, ప్రక్కన ఉన్న డొంక దారి పట్టి, ఈత చెట్ల గుబుర్లలో నుండి, గట్లు, పుట్టలు, చేలు దాటి దూరంగా ఉన్న నిమ్మ తోటలో దూరింది. ఎక్కడ నక్కిందో ఏమో గాని ఎవరికీ కన్పించలేదు. వట్టి చేతులతో కుక్క వెంటబడ్డ జనం తిరిగి వస్తే, చంద్రలీల గుండె గుభేలు మన్నది. సుశీల కన్నుల్లో నీళ్ళు తిరిగాయి.

అంతా కలలో లాగా జరిగి పోయింది!

మెడలో నాల్గు సవర్ల చంద్రహారంతో కుక్క అంతు చిక్కకుండా పోయింది! అయ్యో! ఇప్పుడేం చెయ్యడం?

ఎవరికైనా దొరికితే ఇస్తారా? ఆ కుక్కనే చంపి చంద్రహారం తీసుకోరూ? బంగారపు ముక్కు పుడక-కోసం మెడ పిసికి చంపే ఈ దేశంలో వెధవది కుక్క మెడలో చంద్రహారంతో బ్రతకడమే? ఇంట్లో వాళ్ళకి

## చంద్రలీల ప్రేమలీల

తెలిస్తే ఏమంటారు? ఏమిటిలా జరిగింది? భవాని శంకరాన్ని అవమానం చేద్దామని సంకల్పించిన కార్యం ఎంత అభాసుగా పరిణమించింది? అతను రాకపోతే ఇది జరిగేది కాదేమో? ముందుగా కింగ్‌ను ఇంటికి పంపించెయ్యాలి. దీని మూలంగా నష్టం జరిగింది. ఇటువంటి ఆలోచనలతో చంద్రలీల వ్యథ చెందింది.

ఒకరోజు అయిన తర్వాత పారిపోయిన కుక్క ఎదరింటికి తిరిగి వచ్చింది. కాని దాని మెడలోని చంద్రహారం లేదు. చెప్పడానికి దానికి నోరు లేదు. చంద్రలీల కన్నుల్లో నీరు కుక్కుకొన్నది. వారం రోజులు ఏడుస్తూనే ఉన్నది.

రెండు వారాలు గడిచాయి.

ఆదివారంనాడు ఏమీ తోచక ఇంటి దగ్గర నుండి శంకరం నిమ్మతోట దగ్గరకు సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో వచ్చాడు. తోట వద్ద నుండి చూస్తే, తాటి చెట్లలో నుండి మహిళా కళాశాల అర అరగా కనబడుతున్నది. ఆ కాలేజి చూడగానే చంద్రలీల తళుక్కున మనస్సులో మెరిసింది. చంద్రలీల గర్వం, అతిశయం, విపరీత స్వభావం స్ఫురణకు వచ్చాయి. అప్రయత్నంగా దవడ ఎముకలు బిగిశాయి.

గేటు తీసుకొని తోట లోపలకు వెళ్ళాడు. షెడ్ దగ్గరనుండి నీళ్ళ గొట్టంలో నుండి వస్తున్న చప్పుడు వినబడుతున్నది. షెడ్ దగ్గరకు వెళ్ళాడు. అది తలుపువేసి, గొళ్ళెం వేసి ఉంది. గొట్టంలో వస్తున్న నీళ్ళు, నీళ్ళ తొట్టిలో పడి, దానిలోని రంధ్రం గుండా తూర్పు వైపుగా ఉన్న బోదెలోకి మళ్ళించబడ్డాయి. తూర్పు వైపున నిమ్మ చెట్ల పాదుల్లోకి నీళ్ళు పెడుతూ కమతగాడు కనకారావు రాగం తీస్తున్న శబ్దం ఉండి ఉండి వినబడుతున్నది. పడమటి వైపునకు వెళ్ళి అన్ని పాదులు సరిగా తిరగ వేశారో లేదో చూస్తున్నాడు. తోట చివర మేడి చెట్ల గుబుర్లో కంచెకు దగ్గరగా ఉన్న, నిమ్మ పాదు తిరగెయ్యలేదు. ఎంత మోసం! పనివాళ్ళు ఎందుకు తిరగెయ్యలేదో శంకరానికి అర్థం కాలేదు. పచ్చగా, గుబురుగా ఉన్న లేత నిమ చెట్టది. దాని పాద ఎందుకు వదిలారో తెలుసుకోవాలని కనకారావు దగ్గరకు వచ్చాడు. పాదులకు నీళ్ళు పెడుతూ 'చెల్లియో.... చెల్లకో తమకు చేసిన యెగ్గులు... సైచిరందరున్.... తొల్లి గతించె' అని రాగయుక్తంగా కనకారావు పాడుతున్నాడు. పద్యంలో లీనమై పరిసరాలే మర్చిపోయాడు.

'ఒరేయ్.... కనకం!' అని చప్పట్లు కొట్టాడు శంకరం.

శంకరాన్ని చూసి ఉలిక్కిపడి నుంచున్నాడు కనకారావు. తర్వాత చిన్నగా నవ్వాడు.


# హెచ్. పి. గ్యాస్ వినియోగదార్లకు


HP GAS


# రెండవ సిలిండర్

అన్ని ప్రదేశాలలో ప్రస్తుతం గల హెచ్. పి. గ్యాస్ వినియోగదార్లకు రెండవ సిలిండర్లు జారీ చేయవల్సిందిగా మా హెచ్. పి. గ్యాస్ డీలర్లను కోరడమైనదని హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్, సికింద్రాబాద్ ప్రాంతీయ కార్యాలయం వారు మీకు తెలియజేయడానికి సంతోషిస్తున్నారు.

హెచ్.పి. గ్యాస్ వినియోగదార్లు తమ ఉపయోగార్థం రెండవ సిలిండరును పొందుటకు తమకు రీఫిల్స్ సరఫరా చేస్తున్న హెచ్.పి. గ్యాస్ డీలర్లను సంప్రదించవల్సిందిగా కోరడమైనది.

సీనియర్ రీజినల్ మేనేజర్
హెచ్. పి. సి. ఎల్. సికింద్రాబాద్




'వన్సుమోర్.... అని యినబడినట్టుంది సినబాబు-గారు...యెప్పు డొచ్చారు' అన్నాడు దగ్గరకు వస్తూ.

'ఇందాకనంగా వచ్చాన్రా.... నువ్వు కొలువుకూటం సీనులో ప్రవేశించావ్‌లే. .. అప్పుడు'

'అట్టాగా... నేను సూడనేలేదు సినబాబు'

'ఈ వారం రోజుల నుంచి తోట సరిగా చూస్తే గదా నన్ను చూడడానికి....'

'అదేంటి సినబాబు... రోజూ రావటంలా నేను....'

'వస్తే.... ఆ పడమర చిగుర్న ఉన్న గుబురు నిమ్మ చెట్టు కింద తిరగేసిందీ లేందీ చూళ్ళేదా? అసలు ఎందుకు వదిలేశారు?' చిరాగ్గాఅన్నాడు.

'మరీ.... తిరగేశే రోజు సాయింత్రం ... దాని కింద పెద్ద కుక్క దూరిందంట.... కూలోడు సెట్టు కదిలించేతలికి ఆడిమీద పడబోయిందట... ఆడు బయపడి దాన్ని తిరగెయ్యకుండా వొదిలేశాడంట.... నేను తిరగేద్దామనుకుంటూనే ఉన్న. యిప్పుడు తిరగేత్తా.... '

'ఏడిశావ్ గాని. . నీ పని చూసుకో .. షెడ్‌లో ఉన్న పంగల కర్ర, పార తీసుకురా. .. నేను తిరగేస్తాలే... '

'నిమిసంలో... తెత్తా ..' అని పరుగెత్తుకొని వెళ్ళి పంగల కర్ర, పార తీసుకొని వచ్చాడు. శంకరం నిమ్మ చెట్టు దగ్గరకు వచ్చి, చొక్కా విప్పి, పంగల కర్రతో నిమ్మ కొమ్మల్ని లేపి, చెట్టు చుట్టూ తిరగేయడం మొదలు పెట్టాడు.

పదిహేను నిముషాల్లో తిరగెయ్యటం పూర్తయ్యింది. బాగా చెమట పట్టింది. మొదట్లో రెండు పారలు వేసి, గుబురులోనుండి తీద్దాం అని శంకరం తల లేపేటప్పటికి, తలకి బరువుగా పాము-లాగా తగిలింది ఉలిక్కిపడి చూచేటప్పటికి వ్రేలాడుతూ మెరుస్తున్న చంద్రహారం!

శంకరం గుండె దడదడమంది' నిమ్మ కొమ్మలో స్వర్ణహార ప్రాప్తి!

మట్టి చేతులలో చంద్రహారాన్ని పట్టుకొన్నాడు. కొమ్మ పంగలో నుండి తీసుకొని బైటకు వచ్చాడు. పంగల కర్ర తీసేశాడు. కొమ్మలు వంగిపోయాయి.

చంద్రహారాన్ని పరీక్షగా చూశాడు. చంద్రహారం-లోని నాల్గు పలికల బిళ్ళమీద చంద్రలీల అని పేరు చూడగానే బిగుసుకొని పోయాడు. అతని తలలో జిలుగు జిలుగుగా ఓనాడు జరిగిన సంఘటన పునరావతమ్మైంది. అయితే చంద్రహారం అక్కడకు ఎలా వచ్చిందో అర్థం కాలేదు. కానీ అది ఖచ్చితంగా వొగరుపోతు చంద్రలీలదే! చంద్రలీల తనను అవమానించి, న్యూనత పర్చి తన సమక్షంలో కుక్క మెడలో వేసిన చంద్రహారం ప్రస్తుతం తన హస్తంలో ఉంది!

కాలేజి దిక్కుగా చూశాడు. కుక్క కాటుకు చెప్పు దెబ్బ లాగా చంద్రలీలపై ప్రతీకారం తీర్చుకోడానికి మంచి అవకాశం దొరికింది. ఆడపిల్లకి అంత అహం-కారమా? ఒరి' డబ్బుంటే మటుకు. చంద్రలీల ముఖం దిగాలు పడిపోతే ఎలా ఉంటుందో చూడాలి – మనసులో అనుకొన్నాడు భవానిశంకరం.

'జెండాపై కపిరాజు. ..' అనే పద్యం రాగం తీస్తూ కనకారావు వస్తున్నాడు శంకరం గబుక్కున చంద్ర-హారాన్ని గుప్పిటలో బిగించి చొక్కాను చేతిలోకి తీసుకొన్నాడు.

'అయిపోయిందా... సినబాబుగారూ.... సేతిలో యేందో మెరుసున్నట్టుగా వుందే? యేంటది?'

'అదా? చిలక ప్రాణం!'

'అదేంటండీ. . మాయల పకీరు పేణం సిలకలో వుంటది గాని.... చిలక పేణం సేతిలో వుంటమేంటి?'

'ఆఁ.... ఆఁ.... మాయదారి చిలక ప్రాణం గుప్పెట్లో ఉంటుంది గానీ.... నీ డ్రామా డైలాగులు మాని, ఈ పంగల కర్ర, పార షెడ్డులో పారేసి, ఇంటికి పద' తెచ్చిపెట్టుకొన్న కోపంతో అన్నాడు. కనకయ్య మాట్లాడకుండా ఆ సామాన్లు తీసుకు పోయాడు.

సూర్యుడి ముఖం ఎర్రగా అయ్యింది. పశ్చిమ దిక్కంతా రాగ రంజితం అయ్యింది.

రెండు రోజుల తర్వాత ఒకనాటి సాయంత్రం భవానిశంకరం చంద్రహారంతో చంద్రలీల గదికి బయలు దేరాడు. ఈసారి ధైర్యంగా బయలు చేరాడు.


వరండా ఎక్కాడు. కుక్క పైన పడుతుందేమోనన్న పిరికితనం లోలోపల ఉంది. అయినా మొండి ధైర్యంతో ముందుకు అడుగేశాడు. లోపలినుండి మాటలు వినబడుతున్నవి.

'లీలా' నీ అవివేకాన్ని ఏమనాలో అర్థం కావడం లేదు. లేని దాన్ని మసి పూసి మారేడు కాయనూ చేస్తే ఎంతకాలం నిలవగల్గి ఉంటుందో ఆలోచించడం లేదు నువ్వు. మనం మనలాగే ఉంటే ఏ గొడవలూ ఉండవు లేనిపోని ఆడంబరాలకు పోతే దెబ్బ తింటాం. కళ్ళు పోయే కాటుక ఎందుకే పెట్టుకోడం? మనకి రోజులు బాగా లేవు . మళ్ళా ఆ ఫంక్షన్ వ్యవహారాన్ని నెత్తి మీద వేసుకొంటే మునిగి పోతాం . '

'అబ్బా' సుశీలా' నీకు తెలియదు గాని నోరు మూసుకో అన్నీ ఏడ్‌వర్స్‌గానే పరిణమిస్తాయని ఎందుకు ఊహిస్తున్నావు? మాట యిచ్చాను. .. సాధ్యమైనంతవరకు చేతిది పడకుండా చూద్దాం '

'ప్రతి దానికీ నోరు మూసుకో అనే అంటున్నావు గాని ఒక్కసారైనా నా అభిప్రాయం అనుసరించావా? ఫలితం అనుభవిస్తున్నావు పాపం ... నిజాయి-తీగా, యదార్థంగా నీ చుట్టూ తిరిగిన శంకరం గారికి ఎదురుగా ఆ కోతిగాడు శ్రీధరరావును నిలబెట్టావు. అయినా మనస్సులోని విషయం వెళ్ళగక్కడానికి, కాళ్ళ దగ్గరకు వస్తే, కుక్క మెడలో చంద్రహారం వేసి అవమాన పర్చావు ఆ చంద్రహారాన్ని కాస్తా ఆ పాడు కుక్క ఎక్కడో పారవేస్తే, అందరూ నవ్వుతారని తేలు కుట్టిన దొంగలాగా లోలోపల ఏడ్చుకున్నావు. గోరు చుట్టు మీద రోకలి పోటులాగా పెద్ద శ్రీమంతుడని నువ్వు అనుకొన్న శ్రీధరరావు సిగ్గు లేకుండా 'డబ్బు అవసరం వచ్చింది . మీ చంద్ర-హారం ఇస్తే నాలుగు రోజుల్లో తిరిగి ఇచ్చేస్తా' అని అంటే నా మొహంలోకి చూశావు ... మనుషుల బండారం, మనసుల బండారం ఎప్పుడో ఒకప్పుడు

# ఇవేమన పద్యాలు




దానమడుగువాడు ధరలోన నధముండు
దానమిచ్చువాడు దైవసముడు
దానమిడనివాడు ధన్యుండు గాడయా
విశ్వదాభిరామ వినురవేమ.

బైట పడుతుందే విచ్చిదానా.... అందుకే ఈ భేష-జాలన్నీ వద్దే తల్లీ అంటున్నా....'

'తల్లీ! నీ కో నమస్కారం... ఆ సంగతులన్నీ కెల-కొద్దు... అప్పుడట్లా ప్రవర్తించినందుకు, ఎంత మానసికంగా మధనపడుతున్నానో నీకు తెలియదు.. శంకరంగారు కనబడితే 'ఐయామ్‌సారీ' అని చెప్పడానికే చూస్తున్నా... వారికి బాగా కోపం వచ్చినట్లుంది.... ఈ ఛాయలకే వచ్చినట్లు లేదు.... ఏం జరుగుతుందో చూద్దాం....' అంటున్నది చంద్రలీల.

## చంద్రలీల ప్రేమలీల

కలలోలాగా వింటున్నాడు భవాని శంకరం అతని తలలోని చిక్కు ముడి విడి పోయింది! అయినా మగతనపు అహంకారం అతనిలో పడగ విప్పింది!

తలుపు కొట్టాడు.

'ఎవరూ?' అని తలుపు తెరచి, శంకరాన్ని చూసి 'మీ....మీ. ..రా...?' అని బొమ్మలాగా నిల్చుండి పోయింది. సుశీలకు కూడా నోట మాట రాలేదు.

చంద్రలీలను చూస్తూ శంకరం 'ఇదుగోనండీ' మీ చంద్రహారం.... ఆనాడు నన్ను అవహేళన చేస్తూ కుక్క మెడలో వేసిన చంద్రహారం.... మీరు నిజంగా ఏ ఉద్దేశంతో అలా చేశారో గాని, దాని పర్యవ-సానం ప్రయోజనకరంగానే పరిణమించిందని నేను అనుకొంటున్నా.... ఎందుకంటే గీటురాయి మీద బంగారం బండారం బైటినట్లు ఈ చంద్రహారం వల్ల గ్రహణం పట్టిన మనస్సుకు, సరైన అవగాహన కల్గినందుకు సంతోషిస్తున్నా.... బంగారం మనుషుల్ని కొంటుందేమోగాని. మనస్సుల్ని కొన-లేదనీ, ఆస్తులు అంతస్థులు అంతరాత్మను అణచ లేదనీ కూడా గ్రహిస్తే మంచిది.

కుక్క మెడలో చంద్రహారాన్ని వేశారు గాని మనిషి మెడలో వేశేటప్పుడు ఎటువంటి హారాన్ని వేస్తారో ఆలోచించుకోండి.... వస్తా....' అని అక్కడున్న కుర్చీ మీద చంద్రహారాన్ని ఉంచి మెట్లు దిగాడు.

ప్రాన్పడిపోయిన చంద్రలీలకు అసలు ఏం జరుగుతున్నదా అనే స్పృహ లేదు. కాని కన్నుల్లో నీరు కపోలాల మీదనుండి జారిపోయాయి. సుశీల వైపు మూగగా చూడ్డం తప్ప ఏమి చేయలేకపోయింది.

సుశీల గబుక్కున బైటకు వచ్చింది. శంకరం పది గజాలు వెళ్ళాడు. తొందరగా నడిచి కలుసుకొన్నది. చూసిన శంకరం మాట్లాడలేదు.

9అన్నయ్యగారూ! ఒక్క నిముషం! మీరు చంద్రలీలను క్షమించాలి. పొగరుబోతుతనంతో అనుచితంగా ప్రవర్తించిన మాట నిజమే! దాని ఫలితం అనుభవిస్తున్నది కనీళ్ళతో. అన్ని విష-యాలు మీరు తర్వాత తెలుసుకొంటారు. ఇప్పుడు లీల మనస్సు అద్దంలా ఉన్నది మీరంటే గౌరవం కలిగింది. ఇప్పుడది పెరిగింది. ఆ సంగతి ఆమె నోటి ద్వారానే వినవచ్చు. ఎల్లుండి సాయంత్రం నాలుగు గంటలకు వచ్చి ఐదు నిముషాలు వినియోగిస్తే, మీకు అన్ని సంగతులు విశదంగా తెలుస్తాయి. బొమ్మలాగా లీల నిలబడి కనీళ్ళతో కరిగి పోతుంటే నేను రాయబారిలాగా రాక తప్పింది కాదు. మరి.... మీరు.... ఆదివారం వస్తారుగా.... ఏదో మాట చెప్పండి. మీ మాటే మీ మనస్సనుకొంటాను. మీ మనస్సు లీలకు అందజేస్తాను' అన్నది సుశీల.

శంకరం ఆగాడు. సుశీల కన్నుల్లోకి చూసి నవ్వాడు. తర్వాత అన్నాడు: 'ఇంత మంచి చెల్లెలు దొరికినందుకు సంతోషిస్తున్నా ... ఆధివారం తప్పక వస్తా'. ఈ మాట అని ముందుకు కదిలాడు. ఆ సాయంత్రం అతని జీవితానికి అందాల బృందా-వనమే అయ్యింది.

నవ్వుతూ మెట్లెక్కుతున్న సుశీలను చూచిన చంద్రలీలకు ఎదలో లే వెన్నెల కాసి, కుర్చీమీద చంద్రహారం పుష్పహారంగా అనిపించింది. □